నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | SIDDIPET

రామునిపట్లలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు

జలప్రదాతలకు క్షీరాభిషేకం

- జలాలను చూసి ఉప్పొంగి పోయిన రైతులు
- కాళేశ్వరం ప్రదాత కేసీఆర్,జలసాధకుడు హరీశ్‌రావు అంటూ రైతుల నినాదాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 8: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్లలో శనివారం రైతులు జలప్రదాతలకు క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో రంగనాయకసాగర్ కాల్వల ద్వారా పంటపొలాలకు గోదావరి నీళ్లు విడుదల చేయడంతో రైతులు ఉప్పొంగిపోయారు. తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాళేశ్వరం ప్రదాత కేసీఆర్, జలసాధకుడు హరీశ్‌రావు అంటూ నినాదాలు చేశారు. మండలంలో రంగనాయక సాగర్ రిజర్వాయర్ లెఫ్ట్ కెనాల్‌తో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, చెక్‌డ్యాముల్లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్లనే చెరువులు, కుంటల్లో సాగునీరు పుష్కలంగా ఉందని సంతోషంగా చెబుతున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చొరవతో యాసంగి పంటకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు. సాగునీరు చూసిన రైతులు, ప్రజలు, గ్రామస్తులు తమ పంటలు పండినట్లే అని అంటున్నారు.

కాపులను తక్కువ చేసి చూపడం అన్యాయం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 8 : కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన కుల గణనలో మున్నూరు కాపులను తక్కువ చేసి చూపడం అన్యాయమని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణనలో బీసీలు 42 శాతం ఉన్నారని.. అందులో మున్నూరు కాపులు కేవం 8 శాతమే ఉన్నారనడం పూర్తిగా అవాస్తవమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేలో మున్నూరు కాపులు 18 శాతం ఉన్నారని తెల్పిచెప్పిందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు హరిశంకర్,ఆకుల బాలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కావలెను !

- మెదక్ కలెక్టరేట్‌లో కీలక పోస్టులు ఖాళీ
- అధికారులు లేక కుంటుపడుతున్న పాలన
- ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్న కీలకశాఖలు

మెదక్ కలెక్టరేట్

మెదక్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో పాలనంతా ఇన్‌చార్జిలపైనే నడుస్తున్నది. కీలకశాఖలకు అధికారులు లేక పాలన కుంటుపడుతుంది. ఆయా శాఖలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఎక్కడి ఫైళ్లు అక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. మెదక్ కలెక్టరేట్‌లో సుమారు 40 నుంచి 46 శాఖలు ఉన్నాయి. ఇందులో 12 శాఖలకు వేరే శాఖల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులే ఖాళీగా ఉన్న శాఖల అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జిలుగా, అదనపు బాధ్యతలు చేపట్టిన వారంతా తమ శాఖలకు సంబంధించిన పనుల్లో తలమునకలై ఉంటుండగా అదనపు బాధ్యతలు తీసుకున్నశాఖలపై దృష్టి సారించలేకపోతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో పూర్తి స్థాయిలో

బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం, అధికార వికేంద్రీకరణలో భాగంగా జిల్లాల పునర్విభజన చేపట్టింది. ఇందులో భాగంగా మెదక్ జిల్లా ఆవిర్భవించింది. అన్ని శాఖలకు అధికారులను నియమించింది. గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మెదక్ కలెక్టరేట్‌లోని ఆయా శాఖల్లో ఉన్న అధికారులు కొంత మంది ఉద్యోగ విరమణ పొందారు. కొంత మంది అధికారులు బదిలీల్లో వేరే స్థానాలకు వెళ్లారు. దీంతో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు.

మెదక్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

కీలక శాఖల్లోనూ..

జిల్లాలో అత్యంత కీలకమైన శాఖలకు ఇన్‌చార్జిలే దిక్కయ్యారు. డిసెంబర్ 31న మైనింగ్ ఏడీ ప్రవీణ్ ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత మైనింగ్ శాఖకు ఇన్‌చార్జిలను నియమించలేదు. బీసీ సంక్షేమశాఖలో సంగారెడ్డి బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్‌కు మెదక్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీపీవో అదనపు ఇన్‌చార్జిగా ఎం.బద్రీనాథ్ కొనసాగుతున్నారు. పరిశ్రమలశాఖ మేనేజర్‌గా సంగారెడ్డి జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ హరినాథ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పశువైద్యాధికారి విజయశేఖర్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత ఆ శాఖకు జిల్లా పశు వైద్యాధికారిగా వెంకటయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. జిల్లా వ్యవసాయశాఖకు ఇన్‌చార్జిగా విసెంట్ వినయ్‌కుమార్‌కు అప్పగించారు. జిల్లా కో ఆపరేటివ్ అధికారి కరుణ బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జిగా కరుణాకర్ బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్‌శాఖ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఏహెచ్ ఇన్‌చార్జిగా సతీశ్‌యాదవ్‌కు బాధ్యతలు అప్పగించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా టీ.రాజును ఇన్‌చార్జిగా నియమించారు. హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్స్ ఇన్‌చార్జిగా శ్రీకాంత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. జిల్లా ట్రెజరరీ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సత్యసోమేశ్వర్‌రావును ఇన్‌చార్జిగా నియమించారు.

కాటేజీ పనులు వేగవంతం చేయాలి

నర్సాపూర్ అర్బన్ పార్కు సమీపంలో కాటేజీలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఫిబ్రవరి 8: పర్యాటకుల కోసం నిర్మించే కాటేజీల పనులు వేగవంతం చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ అర్బన్ పార్కు సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం నిర్మిస్తున్న కాటేజీల పనులను ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతంగా అర్బన్ పార్కు చూడచక్కని ప్రదేశమని కితాబిచ్చారు. కాటేజీల నిర్మాణం చేపట్టి ఉపయోగంలోకి తీసుకువస్తే ఆదాయ మార్గాలు మెండుగా ఉంటాయన్నారు. మొత్తం 32 కాటేజీల నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం 10 కాటేజీల నిర్మాణం పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్నాయని, 22 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం

చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థులకు సూచించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల వసతి గృహంలో శుక్రవారం రాత్రి బస చేసిన కలెక్టర్ ఉదయం అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి గుణాత్మక విద్య అందిస్తున్నామన్నారు. లక్ష్య సాధన దిశగా మనల్ని మనం సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యం, ఎదుగుదలపై శ్రద్ధవహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ తగ్గించుకోవాలన్నారు. ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, వసతి గృహ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, అటవీఅధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆటో ఎక్స్‌పో



గీతంలో ఆటోఎక్స్‌పోలో పాల్గొన్న వాహనాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ప్రమాణ-2025' రెండో రోజు శనివారం ఎలక్ట్రిఫైయింగ్ ఆటో ఎక్స్‌పో- ఆటోమేనియా అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ఔత్సాహికులు, విద్యార్థులు రకరకాల వాహనాలతో హాజరయ్యారు. అత్యాధునిక ఆటోమొబైల్ వాహనాలను ప్రదర్శించారు. ఆటో ఎక్స్‌పోలో సెంట్రల్ రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) కూడా అత్యాధునిక ఆయుధ వాహనాన్ని ప్రదర్శించింది. ఈ భారీ వాహనాన్ని పేలుళ్లు, ల్యాండ్‌మైన్ల నుంచి రక్షించేలా రూపొందించారు. వజ్ర, మినీ వజ్ర వాహనాల మాక్‌డ్రిల్ అందరినీ ఆకర్షించింది. ప్రమాణ-2025 సాంకేతిక, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. హ్యాకథాన్లు, సాఫ్ట్‌వేర్-హార్డ్‌వేర్ ప్రాజెక్టు, ఎక్స్‌పోలో విద్యార్థులు పాలుపంచుకున్నారు. శాస్త్ర ప్రదర్శనలు, ఫ్రీ స్టైల్ రాప్ బాటిల్స్, డీజే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సినిమాటిక్ మేకప్, స్ప్రే పెయింట్ ఆర్ట్, స్లిమ్ మేకింగ్, ఎమర్జెన్సీ ఇంపాక్ట్ వంటి వాటిలో శిక్షణ కోసం వర్క్‌షాప్స్ జరిగాయి. 9టీన్, వర్ణం బ్యాండ్‌లహై-ఎనర్జీ ప్రదర్శన విద్యార్థులను ఉర్రూతలూగించింది. విద్యార్థుల ర్యాంప్‌వాక్ అలరించింది. ఈ కార్యక్రమంలో గీతం ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- హామీలు అమలు చేసే వరకు పోరాటం
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. మాట తప్పుడు, మడమ తిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనని విమర్శించారు. శనివారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని హితవుపలికారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసినంత మాత్రాన ఓట్లు పడుతాయా అని ప్రశ్నించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌కు గుండు సున్న పెట్టారని, రానున్న రోజుల్లో తెలంగాణాలో కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందన్నారు.

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా

మర్లబడ్డ ప్రజలు

- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లిలో ధర్నా, రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు,ప్రజలు
- పోలీసుల వలయంలో డంపింగ్ యార్డు పనులు
- అవాంనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించిన ఏఎస్పీ సంజీవ్‌రావు

ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నల్లవల్లిలో జరిగిన ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు

పోలీసుల పహారాలో నల్లవల్లిలో ఆందోళన చేస్తున్న ఆయా గ్రామస్తులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 8: ''హైదరాబాద్ చెత్తకంపు ప్యారానగర్‌కు ఎందుకు.. మా పచ్చని అడవులు, పంటలను నాశనం చేసి మాబతుకులతో ఆటలాడుకుంటారా..? అంటూ ప్రజలు ఆందోళనలు, నిరసనలు, నినాదాలతో హోరెత్తించారు. సీపీఎం నాయకులు ఆందోళనకు సంఘీభావం తెలిపారు. శనివారం సంగారెడ్డిజిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లిలో కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డుకు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. బాధిత గ్రామాల ప్రజలు నల్లవల్లి కేంద్రంగా ఆందోళన చేయడంతో సీపీఎం నాయకులు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కె.రాజయ్య, మానిక్, ఎం. నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావు, పటాన్‌చెరు సీనియర్ నాయకుడు వాజిద్‌అలీ ఆందోళనకు సంఘీభావం తెలిపారు. రోడ్డుపై గంటల తరబడి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపాధి లేకుండా చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ..నాలుగు రోజుల నుంచి డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, జిల్లా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు.ఇక్కడి ప్రజల జీవితాలను నాశనం చేయవద్దని, రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి ఏఎస్పీ సంజీవ్‌రావు పర్యవేక్షణలో నల్లవల్లి,ప్యారానగర్ గ్రామాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు.

పోలీస్‌ల వలయంలో డంపింగ్‌యార్డు పనులు

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు పనులు కొనసాగుతున్నాయి. పోలీసుల వలయంలో ఎవరినీ రాకుండా జాగ్రతలు తీసుకుంటున్నారు. పోలీస్ అధికారులు.. రాత్రి సమయంలో జీహెచ్ఎంసీ నుంచి టిప్పర్లు నడుస్తున్నాయి. టెంట్లు వేసుకుని కూలీలతో ప్రహరీ, బంకర్ల పనులు చేయిస్తున్నారు. గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్ గ్రామాల్లో పోలీసులు టెంట్లు వేసుకుని పహారా కాస్తున్నారు. ఎమర్జెన్సీ పాలన కొనసాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

13న ప్యారానగర్‌లో భూసర్వే

హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్యారానగర్‌లో భూసర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ ప్రకటనలో తెలిపారు. మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లోని 2,3,4, 27,29,35,36, 39,40,41, 44 సర్వే నంబర్లలోని భూముల్లో ఈ నెల 13వ తేదీన మండల సర్వేయర్‌చే సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గంగాభవాని, నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ సర్వే నంబర్లకు సంబంధించిన దరఖాస్తుదారులు, ఆసక్తిగలవారు, చుట్టు పక్కల రైతలు హాజరుకావాలని వారు సూచించారు.

నర్సాపూర్ చౌరస్తాలో విద్యార్థుల రాస్తారోకో

నర్సాపూర్,ఫిబ్రవరి 8: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును వెంటనే రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా విద్యార్థులు రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. మాకొద్దు మాకొద్దు డంపింగ్ యార్డు అంటూ నినాదాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటుతో నర్సాపూర్ రాయారావు చెరువుపూర్తిగా కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని అడవి తల్లి నిర్మానుష్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డుకు నర్సాపూర్ పట్టణం సమీపంలో ఉండడంతో దుర్వాసన వస్తుందని, పైగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునఃపరిశీలన చేసి డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

2009లో డంపింగ్‌యార్డు ఒప్పందం

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో చెత్త రోజురోజుకూ పెరిగిపోతుండడంతో మహానగరం నలుదిక్కుల డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.. 2009లోనే అప్పటి కాంగ్రెస్ సర్కారు హయాంలోనే జవహర్‌నగర్ చెత్తను తగ్గించడానికి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ అటవీప్రాంతంలో, పటాన్‌చెరులోని లక్డారంలో ఏర్పాటు చేయాలని టెండర్‌ను దక్కించున్నాం. ఆ ఒప్పందం అమలులో భాగంగా ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తున్నాం. 2014లో తెలంగాణ ఏర్పాటుకు ముందే డంపింగ్ యార్డు నిర్మాణం జరగాల్సింది. కానీ అప్పటి తెలంగాణ ఉద్యమం వల్ల పాలకులు ఆకార్యక్రమాన్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో రెవెన్యూ విభాగం ప్యారానగర్ స్థలాన్ని రాంకీ సంస్థకు అప్పగించింది. 2015 నుంచి 2023 వరకు ఆలస్యం కావడానికి కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడమే కారణం . 2023లో కేంద్ర అటవీ శాఖ అనుమతులు లభించగానే కాలుష్య నియంత్రణబోర్డుతోపాటు మిగతా అన్ని శాఖల నుంచి ప్యారానగర్ డంపింగ్‌యార్డు నిర్మాణానికి వెంటవెంటనే అనుమతులు లభించాయి.

– శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్

నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నిమ్జ్ ప్రాజెక్టుకు సారవంతమైన భూములు సేకరించొద్దు

అధికారులకు వినతి పత్రం అందజేసిన హుస్సేల్లి భూ బాధితులు

జహీరాబాద్ పట్టణంలోని నిమ్జ్ ప్రాజెక్టు కార్యాలయంలో పాలనాధికారి వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న హుస్సేల్లి భూ బాధితులు

జహీరాబాద్, ఫిబ్రవరి 8 : నిమ్జ్ ప్రాజెక్టు కోసం రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములను బలవంతంగా సేకరించవద్దని సీపీఎం జహీరాబాద్ ఏరియా కార్యదర్శి రామచందర్ డిమాండ్ చేశారు. ఇటీవల నిమ్జ్ ప్రాజెక్టు కోసం సంబంధిత అధికారులు గ్రామానికి చెందిన రైతుల భూములు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. 60 రోజుల్లో రైతులు తమ అభ్యంతరాలు తెలుపాలని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఆధ్వర్యంలో హుస్సేల్లి గ్రామానికి చెందిన నిమ్జ్ భూబాధితులు సంగారెడ్డి కలెక్టర్, జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో, న్యాల్‌కల్ మండల తహసీల్దార్లకు భూములను బలవంతంగా సేకరించవద్దని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారవంతమైన భూముల్లో వాణిజ్య పంటలు, ఆహార పంటలు, పండ్లు, కూరగాయ పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. భూములపైనే ఆధారపడి రైతులు కుటుంబాలను పోషించుకుంటారని పేర్కొన్నారు. సారవంతమైన భూములను నిమ్జ్ ప్రాజెక్టు కోసం తీసుకుంటే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించే భూముల్లో ఎలాంటి పరిశ్రమలు నెలకోల్పుతారో ముందుగానే తెలుపడం లేదని, వచ్చే పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో భూములు కలుషితమై, జంతువులు, ప్రజలు, అనేక రోగాలకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు సారవంతమైన భూములు సేకరించవద్దని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం సేకరించే జాబితా నుంచి రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములను మినహాహించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామ భూబాధితులు రాములు, శివరాజ్, రాజ్‌కుమార్, మారుతీ, కాశీనాథ్‌రెడ్డి, గుండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.